# పూచికపుల్లలు

బంగారానికి వాసన ఉండదు కదా! కానీ ఉంచుకున్న వెంకట్రామయ్య చనిపోగానే రాములమ్మ దగ్గరున్న ఆ నాలుగు తులాల బంగారానికి హఠాత్తుగా వాసన అబ్బింది. ఆ వాసనకు ఊరు ఊరంతా గుప్పుమంది. అదీ అసలు కథ.

కానీ ఆ అరవై ఏళ్ళ రాములమ్మ వెనకాల ఒక కథ ఉంది. ఆ కథని కథలు కథలుగా చెప్పుకునే వాళ్ళకి ఆ ఊళ్లో కొదవలేదు. రాములమ్మ తెలుసా? అని అడగ్గానే 'ఓహ్ అయమ్మనా? వెంకట్రామయ్య చుట్టమురాలు కదా! అంటారు ఆ చుట్టుపక్కల పల్లెల్లోకూడా.

పెద్దమనిషి కూడా కాకుండానే రాములమ్మకు పెళ్ళయింది. కాపురానికి కూడా పోకుండానే ఆ భర్త చనిపోయాడు. తల్లి చిన్నప్పుడే పోయింది. కల్లు బండి లాగి జీవనం చేసే తండ్రి, మతిస్థిమితం తప్పి దేశాల పాలయ్యాడు. ఒక అక్క మాత్రం ఉంది. పెళ్ళయి సంసారం చేసుకుంటోంది. తప్పనిసరి అన్నట్లో దయదలిచి చెల్లెల్ని చేరదీసింది. మొగుడు చచ్చినదానిని ఎవరు పెండ్లి చేసుకుంటారు పాపం! అని రాములమ్మను చూసి ఊళ్లో జాలిపడేవాళ్ళు.

రాములమ్మకు వయసొచ్చింది. ఉప్పు, కారం తిని పెరిగిన శరీరం కదా! మగతోడు కోసం వెతుక్కోబోయింది. అంతే! అక్కకు చీదర కలిగింది. కంపరం పుట్టింది. ఇది నా సంసారాన్ని కూడా కూల్చేటట్లుంది' అనుకుని 'దాటుముండా! నా ఇంట్లోంచి!' అని కేకలేసింది.

అప్పటికి రాములమ్మ శరీరం పువ్వులా విప్పారింది. చిదిమి దీపం పెట్టుకోవచ్చు అన్నట్లుంది. అందుబాటులో ఉన్న ఏ వస్తువు చుట్టూ అయినా అల్లుకుపోవడానికి సిద్ధంగా ఉన్న తీగ ధర్మమేదో ఆమెలో పని చేస్తోంది. మంచి రూపసి కావడంవల్లా, కూలీనాలీ చేసుకుని తన బతుకు తాను స్వతంత్రంగా బతుకుతూండటంవల్లా, రాములమ్మ మీద చాలా మోహపడిపోయారు ఆ ఊళ్లోని యువకులూ, నడివయసు

వాళ్ళు!

రాములమ్మ కొన్నాళ్ళు ఈడిగ మారెప్ప దగ్గర ఉంది. కానీ ఎందుకో విడిచిపెట్టింది. కొన్నాళ్ళకు వడ్డె వెంకప్ప దగ్గరుంది. కానీ ఎందుకో విడిచిపెట్టింది. కొన్నాళ్ళకు అక్క మొగుణ్ణి చేరనిచ్చింది. 'రాములమ్మ బతుకు ఒక గాడిలో పడింది' అని అందరూ అనుకునే లోపలే ఆ బావను కూడా విడిచిపెట్టి వెంకట్రామయ్య శెట్టి దగ్గర చేరింది. అంతే! మరో మగతోడు వెతుక్కునే అవసరం రాములమ్మకు మళ్ళీ జీవితంలో కలగలేదు.

వెంకట్రామయ్యకు ఇరవై ఎకరాల మెట్టసేద్యం ఉంది. ఆ సేద్యం పని అతడు చూసుకుంటాడు. ఇంట్లో ఒక చిన్న అంగడి ఉంది. ఆ అంగట్లో అతని ముసలి తండ్రి కూర్చుంటాడు.

వెంకట్రామయ్యకు భార్య చనిపోయింది. కొడుకున్నాడు. ఏడాది పిల్లోడు. ఆ తల్లిలేని పిల్లోన్ని తనే తల్లయి పెంచింది రాములమ్మ. వెంకట్రామయ్యకు చుట్టమురాలు అన్నమాటేగాని, రాములమ్మ ఎప్పుడూ తిరిపెంకూడు తినలేదు. కష్టం చేసేది, తినేది!

వరిమళ్ళల్లో కోతలకుపోయేది. తోటల్లో గెనాలు చెక్కేదానికి పోయేది. చీరగోచిపోసి పారపట్టుకుని బురదమళ్ళల్లోకి దిగితే రాములమ్మకు మగకూలీలు కూడా సాటిరారు. కానీ ఆయమ్మకు ఏ పని అయినా వెంకట్రామయ్య శెట్టి సేద్యం పనుల తర్వాతనే!!

ముసలి తండ్రి చనిపోయాక రాములమ్మకు ఒక మట్టిమిద్దె కట్టించాడు వెంకట్రామయ్య. తన ఇంట్లోని చిల్లర అంగడిని ఆ మట్టిమిద్దెలోకి మార్చి 'ఇంక ఏ కూలీకీ పోవద్దు. ఇంటిపట్టునే ఉండి అంగడి జరుపుకో! పిల్లోన్ని చూసుకో!' అన్నాడు.

"మా నాయన కూడా పోయినాడు కదా! వచ్చి నాతో మన పెద్దింట్లోనే ఉండరాదా!" అని తమాషాగా అంటాడు వెంకట్రామయ్య.

"ఆ మాట నాలికమీదనుంచి కాదు... మనసులో నుంచి పుట్టుకురావల్ల సామి!" అని నిష్ఠూరమాడుతూ మూతి ముడుస్తుంది రాములమ్మ.

"నువ్వు ఈ మట్టిమిద్దెలోనూ, వెంకట్రామయ్య ఆ పెద్దింట్లోనూ ఎందుకు? నువ్వుకూడా ఆ పెద్దింటికే పోయి ఉండొచ్చు కదా!" అని ఎవరైనా నవ్వుతూ అడిగితే మాత్రం అప్పుడు-

"తప్పు కదమ్మా! నాది తక్కువ కులం! ఆయనది ఎక్కువ కులం!" అనేది నోటిమీద వేలునేసుకుని.

"మరి ఈ పిల్లోడూ..." అని అడిగితే...

"వీడు మాత్రం నా కొడుకేనమ్మా! నా దగ్గరే ఉంటాడు" అంటుంది..., అయిదేళ్ళ పిల్లోడు సుబ్బయ్యని పొదివిపట్టుకుని.

ఏండ్లు, పూండ్లు జరిగాయి. రానూరానూ వర్షాలు వెనకబడ్డాయి. సేద్యాలు దెబ్బతిన్నాయి. రైతులు ఆర్థికంగా చితికిపోయారు. ఇచ్చిన అప్పులు వసూలుకావు. వ్యాపారం అటకెక్కింది. కానీ రాములమ్మ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోలేదు. వడలూ, గుగ్గిళ్ళూ, గుంతపొంగనాలూ గంపలో మోసుకుంటూ చుట్టుపక్కల పల్లెలకు తిరిగి అమ్మింది. ఒక రోజు పొద్దు మునిగేటప్పుడు చేన్లకు అడ్డం పడివస్తూ బావి గుంతలో పడి కాలు విరగ్గొట్టుకుంది.

"నేనుండగా నీకెందుకమ్మా ఈ తిప్పలు?" అన్నాడు మంచం దగ్గరికి వచ్చి సుబ్బయ్య. అప్పటికి నూనూగు మీసాలొస్తున్న సుబ్బయ్య చేతికి అందివచ్చిన సొంత కొడుకులాగే కన్పించాడు.

ఆ ఊరికి చుట్టుపక్కల ఉడేగోళం పరస అనీ, నూగేపల్లి పరస అనీ నాలుగైదు పరసలు జరిగేవి జనవరి, ఫిబ్రవరి మాసాల్లో. ఆ పరసల్లో గుంజలు నాటి, పైన టార్పాలు కప్పి అంగడి ప్రారంభించేది రాములమ్మ. లడ్డూ, జిలేబి, కారా, బూందీ మొదలైనవి తయారు చేసి అమ్మేది. ఒక పరస అయిపోగానే, ఊరికి వచ్చి రెండు మూడు రోజులుండి మరో పరసకు పోయేది. ఆ పరసలో మళ్ళీ వారం పదిరోజులు వ్యాపారం. అట్లా తిరిగి తిరిగి ఆ తిరునాళ్ళ సీజను ముగిసేసరికి చేతిలో వెయ్యో, పదిహేను వందలో మిగుల్చుకునేది.

"ఆ పరసల్లో, దుమ్ములో ముఖం పీక్కుపోయేటట్లు కష్టపడే ఖర్మ నీకేం పట్టింది?" అని వెంకట్రామయ్య ప్రేమగా కసురుకుంటే-

"మన సుబ్బయ్య పెళ్ళి చేసుకుంటే, ఆ వచ్చే కోడలికి నగా నట్రా చేయించవద్దా నేను నా పేరు మీద" అంటుంది నవ్వి.

నిజానికి ఏ యేడుకాయేడు పంటలు లేక అడుగుకు పోతున్న ఆర్థిక పరిస్థితి వెంకట్రామయ్యది!

"వెంకట్రామయ్య కొడుక్కు సంబంధం చూసేదానికి బయలుదేరిపోతుంటే- సుబ్బయ్య నా కొడుకేగానీ, కోడల్ని ఎన్నిక చేసుకునే అదృష్టం ఈ తక్కువ జాతి దానికి లేకపోయె కదా!" అని నిరాశపడింది. సుబ్బయ్యకు వడుగు జరిగి, ఒంటిమీదికి జంధ్యం వచ్చి చేరితే, అది తనకూ, తన కొడుక్కూ మధ్య గోడకడుతున్నట్లు దిగులుపడింది.

నువ్వు పెళ్ళి పందిట్లో మరీ రాసుకుంటూ పూసుకుంటూ తిరగవద్దమ్మా! ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు?" అని ఊర్లో పెద్దలు హెచ్చరిస్తే...

"సుబ్బయ్యా! నా తండ్రీ! నా కొడుకు పెళ్లిలోనే నేను పరాయిదాన్ని అయిపోతిని కదయ్యా!" అని ఒక మూల నిలబడి కళ్ళల్లో నీళ్ళు పెట్టుకుంది. అందరూ బంతిలో కూర్చుని భోజనాలు కానిచ్చి లేచిపోతుంటే ఆ ఎంగిలి విస్తర్లు ఎత్తి పారేస్తే తప్ప ఆమె మనసుకు ఊరట కలగలేదు. సుబ్బయ్య తండ్రి అయ్యాడు. పుట్టిన మనుమరాల్ని

చూసుకోకుండానే వెంకట్రామయ్య కాలం చేశాడు. రాములమ్మ గాజులు పగలగొట్టుకుంది. బొట్టు చెరిపేసుకుంది. ఊర్లో జనం ఆశ్చర్యపోయారు. "తాళి కట్టకపోయినా ఆయన నా భర్త!" అంది స్థిరంగా రాములమ్మ.

జీవితమంతా వివాహ వ్యవస్థకు దూరమైన రాములమ్మ వితంతువుగా మారడంద్వారా ఆ వ్యవస్థలో తనూ భాగం పంచుకున్నట్లు ఏదో ఆత్మసంతృప్తిని పొందింది. సుబ్బయ్య భార్య తనను చూసేది కాదు అని గ్రహించడానికి రాములమ్మకు ఎంతో కాలం పట్టలేదు. "నా కోడలికి నగా నట్రా పెట్టుకోవద్దా నేను" అని అంటూ వచ్చిన రాములమ్మ ప్రస్తుతం ఆ ఊసు ఎత్తడం లేదు.

"ఆ నాలుగు తులాల బంగారాన్ని తన దగ్గరే పెట్టుకుని వాళ్ళకు ఎరగా చూపిస్తుంటే తప్ప వాళ్ళు తన బాగోగులు చూడరు" అనే నిర్ణయానికి వచ్చిందిప్పుడు.

రాములమ్మకు సుంకప్పా, శీనప్పా అని ఇద్దరు అక్క కొడుకులున్నారు. వాళ్ళకు తలకు అయిదు ఎకరాల చేను ఉంది. అయినా రెక్కాడితేగానీ డొక్కాడదు. కూలి దొరకని కరువు రోజుల్లో తట్టాబుట్టా చంకలో పెట్టుకుని 'దేశాంతరం' పోయేవాళ్ళు. తిమ్మక్క అని అక్క కూతురు కూడా ఉంది. కటిక బీదరాలు. విధవరాలు కూడా! పిల్లల్లేరు. కడుపుకు జరిగేది కష్టం.

కులం చెడిన ముండ అని వాళ్ళకు రాములమ్మమీద తక్కువ చూపు! కానీ వెంకట్రామయ్య చనిపోగానే రాములమ్మ దగ్గరున్న బంగారు సొత్తులకోసం చక్కెర జాడ పసికట్టిన ఎర్రచీమల్లా, ఉడుము జాడ పసిగట్టిన వేటకుక్కల్లా ఒక్కొక్కరే రంగప్రవేశం చేశారు. తన పిన్నమ్మ సొత్తుకోసం విధవరాలు తిమ్మక్క మాత్రం పోటీకి రాలేదు. ఇద్దరు తమ్ముళ్ళు ఉండగా, అట్లాంటి ఆస్తి హక్కులు తనకుండే అవకాశం లేదన్న విషయం ఆమె రక్తంలో జీర్ణించుకుపోయి ఉంది.

అక్క మొదటి కొడుకు వచ్చాడు.

"పిన్నమ్మా!" అన్నాడు.

"ఎవరూ...?" అంది.

"నేను సుంకప్పని!" అని లోనికి వచ్చి కూర్చున్నాడు.

కాసేపు ఆ మాటా ఈ మాటా మాట్లాడాడు. వెంకట్రామయ్య మరణానికి సానుభూతి ప్రకటించాడు. అంత గొప్ప మనిషి ఊర్లోనే లేడన్నాడు. కొంచెంసేపు నిశ్శబ్దంగా కూర్చున్నాడు. తరువాత మెల్లగా అడిగాడు. "ఇంక మీదట ఎట్లా బతుకుతావు పిన్నమ్మా?"

"రెక్కల్లో ఇంకా సత్తువ వుంది. ఆ పైన దేవుడున్నాడు నాయనా?" అంది నిర్లిప్తంగా రాములమ్మ.

'ఈ వయసులో కూడా కాయకష్టం చేసుకు బతకాల్సిన ఖర్మ నీకేం పట్టింది

పిన్నమ్మా! రా పోదాం మనింటికి" అన్నాడు ప్రేమ కారిపోతున్నట్టు.

"ఎందుకులే నాయనా! మీ సంసారం బరువులు మీకున్నాయి!" అంది.

"అదేంమాట పిన్నమ్మా! నువ్వేమయినా పరాయిదానివా? రా పోదాం"

"నేను రాను నాయనా!"

"నిన్నే నా తల్లి అనుకుంటాను రా పిన్నమ్మా"

"నేను రాను నాయనా!"

"నిన్ను ఇంటికి పిల్చుకురమ్మని నీ కోడలు శతపోరుతాంది. రా పిన్నమ్మా!"

"నేను రాను నాయనా!"

"రాకపోతే పో! దర్బేసిముండా!" అని ఇంతెత్తుకు ఎగిరిపడ్డాడు సుంకప్ప. "ఆ నాలుగు తులాల్ని కూడబెట్టుకున్నానని కదా నీ ధైర్యం. అది ఎంతవరకూ ఉంటుందో, అది రవంత రవంత కరిగిపోయినంక నీ మొగం ఎవరు చూస్తారో... అదీ చూస్తాలే! నీ ఖర్మ వస్తా!" అని సరసరా వెళ్లిపోయాడు.

అక్క రెండో కొడుకు వచ్చాడు.

"పిన్నమ్మా!" అన్నాడు.

"ఎవరూ?" అంది.

"నేనే శీనప్పని" అని లోనికి వచ్చి కూర్చున్నాడు.

"పాపం! ఉబ్బసమూ, దగ్గూ ఎక్కువయిందంటనే" అని అడిగాడు. "మందూ మాకూ తీసుకుంటున్నావా?" అని విచారించాడు. "పెద్దదానివి! నీతో ఒక మాట కూడా చెప్పకుండా సుబ్బయ్య చేను అమ్మినాడంటనే..." అని పుల్లలు పెట్టేదానికి చూశాడు. ఆ తరువాత మొదలుపెట్టాడు.

"ఒంటిదానివి ఎలా అగసాట్లు పడతావు పిన్నమ్మా? పోదాంరా మన ఇంటికి" అన్నాడు.

"మొన్న మీ అన్న కూడా వచ్చి పిలిచినాడు. నేను రానని చెప్పినాను నాయనా" అంది.

"మా అన్నకే సరిగ్గా కూడు పెట్టదు మా వదిన. అట్లాంటిది నీకు ముద్ద పెడుతుందంటే నువ్వు నమ్ముతావా? మన ఇంటికి పోదాం రా పిన్నమ్మా!" అన్నాడు.

"నేను రాలేను నాయనా!" అంది.

"అక్క కొడుకులు ఉండి కూడా ముసిల్దాన్ని చూడకపోయిరి అని నలుగురిలోనూ మా అన్నదమ్ములకు అపకీర్తి కాదా పిన్నమ్మా?" అని నొచ్చుకున్నాడు.

"అయ్యో! ఆ మాత్రం అభిమానం ఉంటే చాలదా నాయనా?" అంది.

"నువ్వు ఏమీ కష్టం చేయొద్దు. ఇంత ముద్ద తిని కూర్చో, మాకు పెద్దదిక్కుమాదిరి ఉండు, అంతే చాలు" అన్నాడు.

రాములమ్మ తన మనోగతం చెప్పుకొచ్చింది. "ఆ మహానుభావుడు బతికినన్నాళ్ళూ నన్ను పెళ్లాం మాదిరి చూసుకున్నాడు. ఆయన బతికి ఉంటే తన మనుమరాళ్ని గుండెలమీద మోసేవాడు కదా! కానీ ఆయన లేడు. నేనైనా ఆయన మనుమరాళ్ని ఎత్తుకుని సాకల్ల కదా! ఆయన మనుమలూ, మనుమరాండ్లూ అంతా ఒంటికి పోసి నా కోక తడిపితే, వాళ్ళు కాళ్ళతో నా రొమ్ముల్లో గుద్ది ఆడుకుంటే... అప్పుడు కదా నేను ఆయన రుణం తీర్చుకున్నట్లు" అని కళ్ళొత్తుకుంది.

"చూడు పిన్నమ్మా! నేను ఒక మాట చెప్తాను విను" అని విశదీకరించడం మొదలుపెట్టాడు.

"వెంకట్రామయ్య ఉన్నన్నాళ్లూ వాళ్ళతోనే కలిసుంటివి. ఆయన పాయె. అంతటితో నీ రుణమూ తీరిపాయె. నీక్కూడా వయసు పైబడుతాంది. మళ్ళీ నీ కులంవాళ్ళతో నువ్వు చేరుకుంటే మంచిది. నచ్చిపోతే ఎత్తేసేదిక్కు అయినా ఉంటుంది"అన్నాడు.

అందుకు రాములమ్మ "దేవుడు పెట్టినట్లవుతుంది" అని ఒక నిట్టూర్పు విడిచింది.

" నేను బతికినా వీళ్ల దగ్గిరే! నచ్చినా వీళ్ల దగ్గిరే! ఆయన మనుమల్ని విడిచిపెట్టి నేను ఎక్కడికీ రాలేను నాయనా" అని మళ్లీ ఆ మాటే చెప్పింది.

"ఛీ! బేవార్సి ముండా!" అని తోకమీద నాగుపాములా లేచి నిలబడ్డాడు శీనప్ప. "నీకు చెప్పేదీ ఒకటే! ఆ గోడకు చెప్పేదీ ఒకటే! నువ్వు నచ్చిపోతే మేము తొంగిచూసేదానికి కూడా రాములే! నీ పీనిగని ఆ ఎట్టివాళ్ళు ఈడ్చి పారేస్తారులే! ఆ నాలుగు తులాల్నీ కడజేసి సుబ్బయ్య నిన్ను కాకులూ గద్దల పాలు చేస్తాడులే!" అని చర్రుమని పై పంచె విదిలించి వెళ్లిపోయాడు.

చేను అమ్మిన డబ్బులు తీసుకుని మద్రాసుకు పోయి దొంగనోట్ల వ్యాపారంలో దిగాడు సుబ్బయ్య. పొద్దుటికి లక్షాధికారి అయిపోవాలి అనుకున్నాడు. అతని ప్లాను నెరవేరి ఉంటే అంతకు ఎనిమిదింతలు డబ్బుతో తిరిగివచ్చేవాడే! కానీ సర్వం కోల్పోయి చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు ప్రాణాలతో ఊర్లోకి వచ్చిపడ్డాడు.

ఒకరోజు రాములమ్మ అన్నంతింటుండగా వచ్చి-

"అమ్మా" అన్నాడు సుబ్బయ్య.

"రా! నాయనా" అంది రాములమ్మ.

"బోంచేద్దువు రా" అని పిలిచింది.

"నీ చేత్తో తిని చాన్నాళ్ళయింది. నీ దగ్గరే కూర్చుంటానమ్మా. వేరే కంచం వద్దు"అంటూ రాములమ్మ ముందుకు జరిగి కూర్చున్నాడు.

రాములమ్మకు గుండెలో నెర్లు పొంగిపార్లింది. చిన్ననాటి సుబ్బయ్య

గుర్తుకొచ్చాడు. ఆ చిన్న సుబ్బయ్యతో ఈనాడు వికారిగా మారిన పెద్దసుబ్బయ్యను పోల్చి చూసుకుంటే అయమ్మ ప్రాణం పిసికినట్లయింది.

"పెద్దల ఆస్తిని మూడు దుడ్లకు అమ్మి పాడుచేస్తివి కదా నాయనా! ఇంట్లో పాత్రసామానుని కూడా కుదువబెట్టుకుంటా ఉన్నారంట కదా నాయనా! మీ నాయన ఎట్ల బతికె? మీ తాత ఎట్ల బతికె? నువ్వేమి నాయనా ఇట్ల అయిపోతివి?" అని దుఃఖం పట్టలేక వలవలా ఏడ్చింది.

సుబ్బయ్య మాట్లాడకుండా అన్నంతిని లేచాడు. మునర నీళ్ళు బైట చల్లి చేతులు కడుక్కుని కూర్చుంది రాములమ్మ.

"అంగడి వేసుకుంటానమ్మా!" అన్నాడు మెల్లగా.

"సంతోషం నాయనా! బతికితే ఎవరైనా వద్దంటారా?" అంది.

"పెట్టుబడికి ఒక నాలుగువేలు ఉంటే ఇవ్వమ్మా?" అన్నాడు.

"నా దగ్గర ఎక్కడ ఉన్నాయి నాయనా దుడ్లు?" అంది.

"ఫలానా వెంకట్రామయ్య కొడుకు చెడిపోయినాడంటే నీకు మాత్రం అపకీర్తి కాదా అమ్మా!ఊరికే ఇవ్వద్దులే అమ్మా! అప్పుడింత అప్పుడింత నీ బాకీ అంతా కట్టేస్తాను"

ఆ మాటకు రాములమ్మ మనసు నొచ్చుకుంది. "నీకూ నాకూ మధ్య అప్పులూ, వడ్డీలూ అని ఎప్పుడైనా అనుకున్నామా నాయనా? ఇదిగో! ఈ సొమ్ములు తీసుకుపోయి కుదవబెట్టి వ్యాపారం చేసుకో" అని పాత ట్రంకుపెట్టెలోంచి రెండు తులాల బంగారు నగ తీసిచ్చింది.

సుబ్బయ్య ఊర్లో అంగడి వేసుకున్నాడు. ఆ ఏడు చెనిక్కాయ ముప్పావలా పంటపండటంవల్ల వ్యాపారం బాగా సాగింది. సుబ్బయ్య కొంచెం నిలదొక్కుకున్నాడు.

మరుసటి సంవత్సరం మళ్లీ అట్లాంటిదే ఒక పంటల కాలానికి "అమ్మా...!" అన్నాడు.

"ఏం నాయనా?" అంది రాములమ్మ.

"ఒక ఆరువేలు కావాలమ్మా!"

"ఎందుకు నాయనా?"

"ఈసారి చెనిక్కాయ వ్యాపారం చేయాలనుకుంటున్నానమ్మా!"

"వ్యాపారంలో ఎక్కువ గస పెట్టుకోకూడదు తండ్రీ" సలహా ఇచ్చింది.

"నువ్వు చూస్తూ ఉండమ్మా! మా తండ్రి తాతల ఆస్తిని మళ్ళీ సంపాదించుకుంటాను" అని ప్రతిజ్ఞ చేస్తున్నట్టు అన్నాడు సుబ్బయ్య.

"నా దగ్గర అన్ని దుడ్లు ఎక్కడున్నాయి నాయనా!"

గొంతు తగ్గించి "ఆ మిగతా రెండు తులాలు ఉన్నాయి కదమ్మా" అని

అడిగాడు.

"నా దగ్గర ఆ మాత్రమైనా బంగారముంటేనే ఆ బంగారం వస్తుందనే ఆశతో నాకెవరన్నా ఇంత కూడేస్తారు. సచ్చినంక నా పీనిగని మోస్తారు. లేకపోతే నాకెట్ల జరుగుతుంది నాయనా?" అంది. ఆ మాటని రాములమ్మ నవ్వుతూనే అన్నా, ఉన్న సొమ్ములు ఇవ్వబోయేముందు తన జీవికకు భద్రతను ఇవ్వగల పూచీని సుబ్బయ్యనుంచి రాబట్టే ప్రయత్నం కూడా ఉంది.

"అదేం మాటమ్మా! నన్ను కన్నతల్లికంటే ఎక్కువగా సాకినావు. నీకు కూడేసే ధర్మం ఈ కొడుక్కులేదా? నన్ను ఎత్తుకుని మోసిందానివి! నిన్ను మోసే ధర్మం నాకు లేదా?" అన్నాడు ఆవేశంగా సుబ్బయ్య. మళ్లీ గొంతు తగ్గించి అన్నాడు. "నీ సొమ్ములు నాకు ఇస్తే ఒకటీ, ఇవ్వకపోతే ఒకటీ కాదమ్మా! నీ సొత్తు నువ్వు మీ బంధువులకు ఎవరికైనా ఇచ్చుకో! నేను కాదంటే అప్పుడడుగు" అన్నాడు.

"ఇంకా నా వాళ్ళు ఎవరున్నారు నాయనా మీరు కాక" అంది రాములమ్మ. మీ నాయిన పోయినంక మా అక్క పెద్ద కొడుకు వచ్చి పిలిచె! నేను పోతినా? మళ్ళీ ఆ చిన్న కొడుకు సీనప్పకూడా వచ్చి పిలిచె! నేను పోతినా? నీటముంచినా, పాలముంచినా నువ్వే నా కొడుకు అనుకున్నాను. నీకు పుట్టే బిడ్డలే నా మనుమలూ, మనుమరాళ్ళూ అనుకున్నాను. ఇదిగో! తీసుకుపో!" అని అదే ట్రంకు పెట్టెలోంచీ మరొక చిన్న పెట్టె తీసి సుబ్బయ్య చేతుల్లో పెట్టింది.

"అది రెండూ ఇది రెండూ మొత్తం నాలుగు తులాలు. ఇంక నా దగ్గిర ఏం లేదు నాయనా!" అంది,

ఈ పంట కాలం పోగానే నీ సొత్తులు నీకు పువ్వుల్లో పెట్టి తెచ్చిస్తానమ్మా! ఈ రెండు తులాల్నీ కుదువబెట్టి వ్యాపారంలో పెట్టి దీన్ని ఎంతెంత చేస్తానో చూడు" అన్నాడు సుబ్బయ్య.

"సంతోషం నాయనా! బాగా బతుక్కో! మీ నాయన పేరు నిలుపు. నీ వంశానికి కీర్తి తీసుకురా!" అంది రాములమ్మ.

అప్పటినుంచీ మొదలయింది రాములమ్మ అక్క కొడుకులకు సుబ్బయ్యమీద కక్ష! తమకు చేతకాని కార్యాన్ని సుబ్బయ్య తెలివితో సాధించుకున్నాడు కదా! అని వాళ్ళలో ఉక్రోషం. ఇక్కడ సుబ్బయ్య తెలివికంటే రాములమ్మ పిచ్చి మమకారమే పనిచేసిందన్న వాస్తవాన్ని వాళ్ల బుర్రలు నిరాకరించాయి.

"ఆ కుదువపెట్టిన సొత్తుల్ని విడిపించుకుని రాకూడదా నాయనా?" అని అడిగింది ఒక రోజు రాములమ్మ.

"చెళ్ళికెరలో చెనిక్కాయ పట్టీలకు ఇంకా దుడ్లు ముట్టలేదు" అన్నాడు.

"ఇంట్లో సొత్తులు ఉంటే నీ పెళ్లామో పిల్లలో ఎవరో పెట్టుకుంటారుకదా!" అని

అడిగింది ఒక నెల తరువాత.

"వచ్చే నెల చూస్తాలేమ్మా!" అన్నాడు.

ఆ వచ్చే నెల మళ్లీ గుర్తు చేసింది.

"ఆ సొత్తుల కతనీకెందుకు. మనింట్లోనే ఇంత ముద్ద తిని కృష్ణా రామా అనుకోకూడదా?" అని విసుక్కున్నాడు.

తర్వాత కొన్నాళ్ళకు తెలిసింది సుబ్బయ్య బంగారాన్ని తాకట్టు పెట్టలేదనీ, సొత్తుల్ని అమ్మేసిన తరువాతే వ్యాపారంలోకి దిగాడనీ!

రాములమ్మ మట్టి మిద్దెని చెనిక్కాయ బస్తాలు నిలువ చేసుకోవడానికి వాడుకున్నాడు సుబ్బయ్య. సుబ్బయ్య ఇంటిముందు అరుగును ఆశ్రయించింది రాములమ్మ. రాములమ్మ వచ్చి చేరాకే ప్రపంచంలో ఉపయోగపడని వస్తువంటూ ఏదీలేదన్న విషయాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకుంది సుబ్బయ్య భార్య.

రాములమ్మ పొద్దున్నే లేచేది. ఇంకా అందరూ గురకలు తీస్తుండగానే పొయ్యి కాగు ముట్టించేది. కసువులు నూకేది, గిన్నెలు కడిగేది. పొద్దున పోయి మధ్యాహ్నానికి గోనెసంచినిండా పచ్చి ఆకులు పీక్కు వచ్చేది. సుబ్బయ్య భార్య పెట్టింది తిని విస్తరాకులు కుట్టే పనిలో పడేది. బియ్యం చెరిగేది. పిండి దంచేది. సాయంత్రం నీళ్ళు ఎత్తుకొచ్చేది.

ఏండ్లు గడిచాయి. సుబ్బయ్య ఇద్దరు కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేశాడు. అత్తగారింటిలో వాళ్ళకి సుస్తీ చేస్తే పది రోజులు అవ్వను పంపమని జాబులు రాసేవాళ్ళు. రాములమ్మ పోయి పది ఇరవై రోజులు వాళ్ల ఇండ్లలోనే ఉండి చాకిరీ చేసి వచ్చేది. వాళ్ళకు కాన్పులొస్తే పురుళ్ళు పోసింది. వాళ్ళు కన్నబిడ్డల్ని తన మునిమనుమలు అనిమురిసిపోయింది. మునిమనుమలకు సాంబ్రాణి వేస్తే నేరుగా స్వర్గానికే పోతారంట అని రాములమ్మని హాస్యమాడేవాళ్ళు చుట్టపక్కాలు.

మిద్దెమీద ఎండబెట్టిన ఆ వడియాలు ఏమాయెనో, నిన్ననగా పేటకుపోయిన సుబ్బయ్య ఇంకా ఇల్లు చేరలేదు ఎందుకనో, ఒక్కగానొక్క మనుమని పెండ్లిని చూడకుండానే చచ్చిపోతాననో, వాళ్లకోసం తాపత్రయపడి పోయేది. ఆ కుటుంబంతో రాములమ్మకు ఎంత దగ్గరి సంబంధం ఉన్నా, రాములమ్మని వంట ఇంటిలోనికి మాత్రం అడుగుపెట్టనివ్వలేదు సుబ్బయ్య భార్య. చిత్రమేమంటే ఈ తక్కువతనాన్ని ఆమె కులపరంగా స్వీకరించిందికానీ, తన వ్యక్తిత్వానికి న్యూనతగా భావించలేకపోయింది.

ఏండ్లు జరిగిపోతున్నా సుబ్బయ్యకూ, రాములమ్మ అక్క కొడుకులకూ మధ్య రావణకాష్టంలా చిచ్చు రగులుతూనే ఉంది. వాళ్ళు తమ కులం బలాన్ని ఆశ్రయించి సుబ్బయ్య మీద ఏవేవో పంచాయితీలు జరిపించి తప్పులు మోపితే, సుబ్బయ్య పక్క

ఊర్లోని ప్రెసిడెంటుని ఆశ్రయించి వాళ్లమీద పోలీసు కేసులు పెడుతున్నాడు. ఈ తగాదాలు ముదిరి పాకాన పడుతున్న క్లిష్ట పరిస్థితుల్లోనే రాములమ్మ ఒక దినం పట్టుతప్పి పడిపోయింది.

"అమ్మా! అమ్మా!!" అని పిల్చాడు సుబ్బయ్య. "అత్తా అత్తా" అని పిల్చింది సుబ్బయ్య భార్య. "అవ్వా! అవ్వా!!" అని ఏడ్చారు సుబ్బయ్య పిల్లలు. రాములమ్మ ఉలకలేదు. పలకలేదు. ఊపిరి తీసే కట్టెలా పడిపోయి ఉంది.

"ఈ ముసిల్ది చచ్చిపోతే ఆ చావుకు కారణం నేనే అంటారు. పంచాయితీ జరిపించి తప్పు మోపుతారు. పంచాయితీకి హాజరవుతే నూర్లు నూర్లు జరిమానా. హాజరుకాకపోతే ఊరినుంచి వెలి. ఈ ముసిల్ది పోయి పోయి ఇప్పుడే చావల్నా?" ఈ ఆలోచన్లతో అతనికి వచ్చే ఏడుపు కూడా రాలేదు. కానీ తప్పదుకదా! అనుకున్నాడు. "అయ్యో! నా ఇంటికి పెద్ద దిక్కు లేకుండా పాయెనే!" అని పొర్లి పొర్లి ఏడ్చాడు.

"నిన్న బాగుంటివి కదా అత్తయ్యా! గోగాకు పప్పు తినబుద్ధి పుడుతుందని చెప్పి నిన్న చేయించుకుని తింటివి కదా అత్తయ్యా!" అని ఏడ్చింది సుబ్బయ్య భార్య.

సుంకప్ప వచ్చాడు.

"అయ్యో కంపపుల్ల మాదిరి అయిపోయినావు కదా పిన్నమ్మా!" అని ఏడ్చాడు. "ఆస్పత్రికి తీసకపోకుండా మా పిన్నమ్మని ఈడనే సంపల్లని అనుకున్నారా?" అని అరిచాడు.

శీనప్ప వచ్చాడు.

"ఎవర్నో నమ్మి నీ పానం మీదికి తెచ్చుకుంటివి కదా పిన్నమ్మా!" అని ఏడ్చాడు.

"ముసిల్దాని బంగారు సొత్తులన్నీ కొట్టేస్తివి కదరా! ఆస్పత్రిలో చేర్పమంటే దుడ్లు ఖర్చు అయిపోతాయేమో అని దిక్కులు చూస్తా నిలబడతావుకదరా!" అని అరిచాడు.

సుబ్బయ్య గొణుక్కుంటూ సణుక్కుంటూ రాములమ్మను ఎద్దుల బండ్లో వేసుకుపోయి రాయదుర్గం ఆస్పత్రిలో చేర్పించాడు.

అక్కడ పది దినాలయినా స్పృహలోకి రాలేదు రాములమ్మ. ఏదో పనిమీద తమ ఊరినుంచి పేటకు వచ్చి పనిలో పనిగా రాములమ్మవైపు తొంగి చూసి పోయేవాళ్ళకి సుబ్బయ్య కాఫీలు ఇప్పిస్తున్నాడు. బీడీ కట్టలు ఇప్పిస్తున్నాడు. వాళ్ళు ఆ ఉద్దర కాఫీలు తాగి, బీడీలు కాల్చి "నువ్వు కాబట్టి ఈ ముసిల్దానికి ఇంత సేవ చేస్తున్నావు" అని మెరమెచ్చు మాటలు మాట్లాడిపోతున్నారు. పంచాయతీ జరిగేవరకూ ఈ మాటే మీ నోట్ల ఉంటే బతికిపోతా నేను!" అని సుబ్బయ్య మూలుక్కుంటున్నాడు.

ఒకసారి ఆస్పత్రి వార్డులోకి వచ్చిన సుబ్బయ్య రాములమ్మ ముఖంలోకి చూసి ఉలిక్కిపడ్డాడు.

"ఏమే! ముసిల్దానిది ముక్కు పుడక ఏదీ?" అన్నాడు గాభరాగా.

"కుదువబెట్టినాను" అంది సుబ్బయ్య భార్య.

'ఎందుకు?"

"ఊరినుంచి వచ్చినోళ్ళకు కాఫీలు ఇప్పించి మంచి చేసుకో అని చెప్తావు. దుడ్లేమో ఇయ్యవు" అంది నిష్ఠూరంగా.

"ఎక్కడ కుదువబెట్టినావో చెప్పు"

"ఎక్కడ కుదువబెడితే నీకెందుకు పోరాదా! ఆ ముక్కు పుడకని నాకే ఇస్తానని చెప్పింది ముసిల్ది"

"అబద్ధం కూతలు కూయొద్దు. ఆ ముక్కు పుడకను నీకు ఇస్తాననలేదు, నాకూ ఇస్తాననలేదు. సచ్చిపోయినంక తనను తాపం చేసినోళ్ళకు అవి చెందుతాయని చెప్పింది. అయినా దాన్ని నువ్వెక్కడ కుదువబెట్టి ఉంటావులే! కొంగుకు గంటేసుకుని ఉంటావు" అని వెళ్ళబోయి ఆగిపోయాడు.

రాములమ్మ చెవులకు రాళ్ళకమ్మలు వేలాడుతున్నాయి.

"మందులకీ, సూదులకీ, మన ఊరి నాకొడుకులకి మర్యాద చేసేదానికీ... అబ్బబ్బ! ఎన్ని ఖర్చులో!" అని విసుక్కుంటూ ఆ కమ్మలు రెండూ విప్పుకుని వెళ్ళిపోయాడు.

సుబ్బయ్య అటు వెళ్ళాడోలేదో... రాములమ్మ మూలిగింది. "అత్తా! అత్తా!!" అని ఆత్రంగా పిలిచింది సుబ్బయ్య భార్య! "ఏం కావల్ల! ఏం కావల్ల!!" అని అడిగింది.

"సుబ్బయ్యా! నాయనా సుబ్బయ్యా!!' అని నీరసంగా మూలిగి మళ్ళీ కోమాలోకి పోయింది.

డాక్టరు వచ్చి పరీక్షించి అనంతపురానికిగానీ, బళ్ళారికిగానీ తీసుకుపోండి. బతకవచ్చు" అన్నాడు.

సుబ్బయ్య మనసులో ఆలోచనలు. ఒక వేళ ముసిల్ది బతికిందే అనుకో! అక్కడే అనంతపురం ఆస్పత్రిలో నెలదినాలయినా ఉండవలసివస్తుంది. ఆ నెల దినాలూ హోటళ్ళలో తిండీ తిప్పలకు ఎన్ని ఖర్చులు! ఒకవేళ చచ్చిపోయిందనుకో! శవాన్ని అక్కడే తాపం చేస్తిమి అనుకో, ఊర్లో అయమ్మ బంధువులతో పోరు! ఎట్లరా సచ్చేది దేవుడా! సస్తే సచ్చింది. ఊరికే తీసుకుపోతాను" అనుకున్నాడు.

"ఏమే! ఇంక ముసిల్ది బతకదు. ఊరికి తీసుకుపొండి అని డాక్టరు చెప్పినాడని మన ఊర్లోవాళ్ళకి చెప్పు" అన్నాడు రహస్యంగా.

జేబులో చేయిపెట్టినప్పుడల్లా తగులుతున్న మందుల చీటీని గబుక్కున బైటికిలాగి ఉండగా చుట్టి విసిరికొట్టాడు, సైడు కాలువలోకి ఎవరూ చూడకుండా.

వెంకట్రామయ్య కట్టించిన మట్టి మిద్దెను ఖాళీ చేసి, నేలమీద ఒత్తుగా ఎండుగడ్డి పరిచి, ఆ గడ్డిమీద ఒక దుప్పటీ, చినిగిపోయిన పాత చీరెలూ పరిచి

రాములమ్మను పడుకోబెట్టారు.

రాములమ్మ మూల్గుతుంది కానీ మాట్లాడలేదు. "అయమ్మ గొంతులోకి పాలు పోయండి. నారింజరసం పొయ్యండి. గ్లూకోజు నీళ్ళు పోయండి. కొబ్బరినీళ్ళుపోయండి" అని డాక్టరు చెప్పిన జాగ్రత్తలన్నీ గాల్లో కలిసిపోయాయి. మూడు పూటలా ఇంతకాఫీ, గంజీ మాత్రం కాచిపోస్తోంది సుబ్బయ్య భార్య.

నాలుగోరోజుకు రాములమ్మ గది ఉచ్చ కంపు కొట్టడం ప్రారంభించింది. ఆ గదిలోకి తొంగి చూడటమనే ఆలోచనే సుబ్బయ్య భార్యకు కంపరం కలిగిస్తోంది.

ఒక దినం రాములమ్మ అక్క కూతురైన విధవరాలు తిమ్మక్కను పిలిచింది.

"ఇదిగో తిమ్మక్కా! ఇట్లారా!"

"ఏం నాగవేణమ్మా!"

"నేను దినమూగంజి కాచి ఇస్తాను. నువ్వు మీ పిన్నమ్మ నోట్లో పోసి రాకూడదా?"

"నాకేం పట్టింది...?"

"మీ అమ్మకు స్వయానా చెల్లెలు కదా?"

"అయితే నాకేమీ?"

"నీకు మీ పిన్నమ్మవి పాత చీరలు ఇస్తాన్లే"

"ఊహా..."

"మీ పిన్నమ్మది నులకమంచం కూడా ఇస్తాన్లే"

"ఊహా..."

"మీ పిన్నమ్మవి పాత్ర సామాన్లు కూడా నువ్వే తీసుకో"

"ఐతే సరే! కానీ..."

"ఇంకావిమి?"

"దినమూ అన్నం పెట్టి పదిరూపాయలు కూలీ కూడా ఇయ్యాల్ల"

సుబ్బయ్య భార్యతిట్టుకుంది. "అన్నం పెట్టి అయిదు రూపాయలు ఇస్తాను. అంతకంటే లేదు" అంది. విధవరాలు తిమ్మక్క ఒప్పుకుంది. ఆ పూటకు కాచిన గంజిని రాములమ్మ గొంతులో పోసి, ఇంత అన్నం పెట్టించుకుని పోయింది.

చెల్లెలి గుడిసెలోకి వచ్చాడు నుంకప్ప.

"వరి అన్నం తింటున్నావే?..."

"నాగవేణమ్మ ఇంట్లోది. పప్పులోకి తిరగమోత పెట్టినారురా! బాలే వుంది! రా తిందాము!"

"బాగుంటే తిను. మన పిన్నమ్మ నోట్లోకి గంజిపోసే దానికి ఒప్పుకున్నావంటనే...?" అన్నాడు తన అక్క ఏదో తప్పు చేసినట్లు.

"ఊ...' అంది అమాయకంగా తిమ్మక్క.

"ఆ ముసిల్దానికి చాకిరీ చేసేదానికి నీకేం ఖర్మ వచ్చింది?"

"పెన్నమ్మవి పాత కోకలూ,పాత్ర సామానూ, నులకమంచం కూడా నాకే ఇస్తానని చెప్పింది. అందుకని ఒప్పుకుంటి"

"నువ్వు ఉత్త వెర్రిబాగులదానివి అక్కా! ముసిల్దాని బంగారమంతా వాళ్ళు దిగమింగి అయమ్మవి పాతకోకలూ, నత్తుగిన్నెలూ నీ మొగాన కొడతారా? అంత గతిలేని వాళ్ళమా మనం?"

"మరి ఏం చేయల్లరా?"

సుంకప్ప గొంతు తగ్గించి అన్నాడు. "పెన్నమ్మవి రాళ్లకమ్మలు ఉన్నాయి కదా! అవైనా ఇమ్మను. లేకపోతే ఒప్పుకోవద్దు"

"ఔనురా! నా తెలివి దొంగలుతోలా! ఇప్పుడే అడిగి వస్తానుండు" అని ఎంగిలి చేయి కడుక్కుని పారిపారి వచ్చింది తిమ్మక్క.

"నాగవేణమ్మా! నాగవేణమ్మా!!"

"ఏం తిమ్మక్కా?"

'మా పిన్నమ్మవి రాళ్ల కమ్మలు ఉండల్ల కదా! అవైనా ఇప్పీకూడదా నాకు?" అంది.

"కమ్మలా!ఆ కమ్మలు ఇంకా యాడ ఉండాయి? ముసిల్దాని మందులకు దుడ్లు లేకపోతే పేటలో అమ్మేస్తిమి!"

"అట్లనా? అయ్యో! ఆశపెట్టుకుని వస్తినే" అని వచ్చేసింది. సుంకప్పతో ఆ మాటే చెప్పింది.

"ముక్కెర కూడా ఉంది కదా! దాన్నేం చేసినారో అడగలేదా నువ్వు?" అన్నాడు.

"అయ్యో! నా మతిమండా! అది గుర్తే రాలేదు చూడు. ఇప్పుడే అడిగి వస్తానుండు" అని మళ్ళీ పారిపారి వచ్చింది.

"నాగవేణమ్మా! నాగవేణమ్మా!"

"ఏంతల్లీ మళ్ళీ వస్తివి?"

"మా పిన్నమ్మది ముక్కు పుడక ఉండల్ల కదా! అదైనా ఇప్పీకూడదా నాకు?"

"ముక్కుపుడకా! దాన్ని నన్నూరు రూపాయలకు కుదువబెట్టినాడంట నా మొగుడు"

"ఎట్లమల్ల?"

"ఆ నన్నూరు రూపాయలూ నువ్వే కట్టి విడిపించుకో"

ఆ విషయం వినగానే సుంకప్ప మనసులో ఛరా అంది. "ఆ దుడ్లు పెడితే నువ్వు కొత్త ముక్కుపుడకే కొనుక్కోవచ్చుకదా! ఇంక నీకు వాళ్ళు ఇచ్చేదేంది?" అన్నాడు.

"వాళ్ళకేనా తెలివుండేది. మనకు లేదా? ముసిల్దాని సొమ్ము ఎవరు తిన్నారో

వాళ్ళే చేస్తారు చాకిరీ! మనకేం పట్టింది" అన్నాడు.

"ఆ పాత చీరెలూ, పాత్ర సామానూ..." అని తిమ్మక్క నసుగుతుంటే "థూ దరిద్రపు ముండా! నీకు రోషం లేదా! అడుక్కుతినే బుద్ధినీది. మా వంశంలో తప్పపుట్టినావు" అని అరిచాడు.

"రోషాలకు పోతే కడుపునిండుతుందా?" అంది బెరుకుగా తిమ్మక్క.

సుంకప్ప అనునయంగా అన్నాడు. "ముసిల్ది సచ్చిపోయినంక ఆ పాత చీరెలూ, పాత్రసామానూ అన్నీ నీకే వచ్చేటట్లు చూసే పూచీనాది!సరేనా! కానీ నువ్వు మాత్రం ఆ సుబ్బయ్య పెళ్లాం దగ్గరికిపోయి మళ్ళీ మంతనాలు జరిపినావంటే చూడు?" అని గట్టిగా హెచ్చరించాడు.

సుబ్బయ్య భార్య ఒక పూట గంజి, ఒక పూట కాఫీ కాస్తోంది. సుబ్బయ్య కొడుకు మూతికి టవల్ చుట్టుకుని రెండు అంగల్లో గదిలో దూరి, రెండు నిముషాల్లో బయటపడుతున్నాడు, ఆ గంజినో, కాఫీనోరాములమ్మ గొంతులో పోసి. రాములమ్మతో చాకిరీ చేయించుకున్న సుబ్బయ్య కూతుర్లు వచ్చి చుట్టపు చూపుగా చూసి ఎప్పుడో వెళ్ళిపోయారు.

ఖర్మకాలి తను చూసేదానికి పోయినప్పుడే ఆ ముసిల్ది చచ్చిపోతే తనే ముసిల్దాని గొంతు పిసికి చంపినాడని పుకార్లు పుట్టిస్తారు. పోలీసు కేసు కూడా పెడతారు. ఎందుకొచ్చిన పీకులాట... అనుకుని సుబ్బయ్య ఆ ఛాయలక్కూడా పోలేదు.

ఆ గదిలోని రాములమ్మ మూలుగులు బయటినుంచి వినే వాళ్ళకు చిత్రమైన భయం కలిగిస్తున్నాయి. ఆ రాత్రి గదిలో చీకటి. చీకట్లో రాములమ్మ. రాములమ్మ మెదడులోకి చల్లగా వ్యాపిస్తున్న చీకటి. చీకటి బరువు కింద చిట్లిపోతున్న ఏవో జ్ఞాపకాలు...

ఏమే రాములూ... అని నవ్వుతున్న వెంకట్రామయ్య. తనను చుట్టేసుకోబోతున్న నలుగురు మగవాళ్ళ చేతుల్ని వెంకట్రామయ్య కోసం విడిపించుకోజూస్తోంది.

పరసల్లో జోరుగా సాగుతున్న వ్యాపారం. గుంపులు గుంపులు జనాలు. వాళ్ల పాదాల తొక్కిడి కింద లేస్తున్న దుమ్మూ, ధూళీ! సుబ్బయ్య పరసలో తప్పిపోయాడు. "నాయనా! సుబ్బయ్యా!" రాములమ్మ ఏడుస్తోంది. "అవ్వా అవ్వా అని వెంటపడుతున్నారు తన మనుమలూ, మాటలు రాని మునిమనుమలూ...

కాలుతున్న పిడకల మీద కురుస్తున్న సాంబ్రాణి పొడి! పొగ లేస్తోంది... పైపైకి పోతోంది. పొగతో కలిసి తను కూడా పోతోంది. తేలితేలి పోతోంది. "అపు అపు! బండి అపు" ఏదో మరిచిపోయింది తను! ఏంది? ఏంది? తిత్తి, తన వక్కాకు తిత్తి!! తిత్తి గుమ్మరించి కట్లపొడిలో కలిసిపోయిన చిల్లర నాణేల్ని ఏరుకుంటున్న సుబ్బయ్య! అమ్మయ్య!! భయం లేదులే!! తిత్తి తన సుబ్బయ్య కాడనేఉంది.

లాంతరు వెలుగు గుడ్డిదైపోతోంది. నేను పోతున్నాను నాయనా సుబ్బయ్యా! పిల్లల్ని సరిగా చూసుకో! నేను పోతున్నానమ్మా నాగవేణమ్మా! తలుపులు భద్రంగా వేసుకో! వాకిలికి లోపలి గడియ పెట్టుకోవడం మరిచిపోయేవు తల్లీ...!

ఆ రోజు పొద్దున్నే మూడు గుక్కల కాఫీ నీళ్ళు అదా అయ్యాయి సుబ్బయ్య ఇంట్లో..

రాములమ్మ శవం! గుంపులు గుంపులు మనుషులు! వచ్చేవాళ్ళు వస్తున్నారు. పోయేవాళ్ళు పోతున్నారు. మధ్యాహ్నానికి ఎవరూ మిగల్లేదు అక్కడ. దిక్కులేని శవమైపోయింది రాములమ్మ. నలుగురు పెద్ద మనుషులు కలిశారు సుబ్బయ్యని.

"ఆ బంగారం ఇస్తే తప్ప పీనిగని మోసేది లేదు అంటున్నారు రాములమ్మ అక్క కొడుకులు

"ఇంకా ఎక్కడుందీ ఆ బంగారం?"

"దానికి దుడ్లు కట్టిచ్చినా ఫర్వాలేదు"

"ఇప్పుడు అంత స్తోమత నాకు లేదు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసి ఫకీరునైపోయినాను"

"అయితే నువ్వే మోస్తావా?"

"నేనెందుకు మోస్తాను? ఆయమ్మ కులమేమి? నా కులమేమి?"

"బంగారం మింగేటప్పుడు అడ్డం రాలేదా ఆ కులం?"

"నిన్ను సాకింది కదా?"

"సాకితే, ముసలి ముప్పున కూడేసినాను కదా!"

"మరెట్ల?"

"ఆ మాత్రం మొయ్యలేరా వాళ్ళు?"

"మొయ్యమంటున్నారు. పీనిగని నువ్వు అయినా మొయ్యి లేకపోతే ఆ బంగారంకు దుడ్లు అయినాకట్టియ్యి. రెండిట్లో ఏదో ఒకటి. ఆ తర్వాత నీ ఇష్టం. శవాన్ని అట్లే పెట్టుకుంటే మేం ఒప్పుకోం" అని వెళ్ళిపోయారు.

నాలుగు తులాల బంగారంకు డబ్బు కట్టివ్వలేను. ముసిల్దాన్ని మోయనూలేను. ఆ పీనిగని ముట్టుకుంటే కులంనుంచి వెలివేస్తారు. కొడుక్కు పిల్లనివ్వరు. చిన్న కూతురుకు మొగుడు దొరకడు. ఒకవేళ సంబంధాలు వచ్చినా కొడుకు కట్నం తగ్గుతుంది. కూతురి కట్నం ఎక్కుతుంది" అని ఆలోచించాడు సుబ్బయ్య.

ఇళ్ళ అరుగుల మీదా, చింతచెట్ల కిందా మాటలు! ఉండి ఉండి గుసగుసలు! పీనిగని ఎవరు మోస్తారో అని ఉత్కంఠత!

రాములమ్మ కులంవాళ్ళే ఎవరన్నా ముందుకొస్తారని బింకంగా కూర్చున్నాడు.

పొద్దు మునిగినా ఎవరూ రాలేదు. సుబ్బయ్య గుండె గుబగుబలాడింది. ఆ రాత్రి నిద్రపట్టలేదు.

ఆ పొద్దున జంకుతూ జంకుతూనే ఎట్టివాళ్ళను పిల్చుకొచ్చాడు సుబ్బయ్యకొడుకు. రాములమ్మ అక్క కొడుకులు వీధిలోకి వచ్చి నిలబడ్డారు.

'మా పిన్నమ్మ పీనిగని ఎట్టివాళ్ళతో మోయించినావంటే చూడు నువ్వు ఈ ఊర్లో ఉండలేవు" అని అరిచాడు సుంకప్ప.

'ఈ ఊర్లో కాదు. ఈ భూమ్మీదే ఉండలేవు" అని అరిచాడు శీనప్ప.

రాములమ్మ చుట్టుపక్కల నాలుగిండ్లకు బీగాలుపడ్డాయి..."వాసన...గబ్బు వాసన. పీనుగ కంపు కొడుతోంది" అంటున్నారు. సుబ్బయ్యను దుమ్మెత్తి పోస్తున్నారు. రాములమ్మ అక్క కొడుకుల్ని లోలోపల తిట్టుకుంటున్నారు.

సుబ్బయ్య ఒక చీటీ రాసిచ్చి కొంత డబ్బు చేతికిచ్చి కొడుకును ఎక్కడికో రహస్యంగా పంపించాడు. సాయంత్రం నాలుగ్గంటలకు నలుగురు మనుషుల్ని వెంటపెట్టుకుని వచ్చాడు సుబ్బయ్య కొడుకు. అంత్యక్రియలకు అవసరమైన సరంజామా అంతా వెంట తెచ్చారు వాళ్లు. వచ్చీ రాగానే పాడె బిగించబోతున్న వాళ్ళని రాములమ్మ అక్క కొడుకులు అడ్డుకున్నారు.

"మేం ఇంతమందిమి ఊర్లో ఉండగా మీరెట్ల మోస్తారు?"

"ముసిల్ది మాకూ చుట్టమే"

"మాకంటే దగ్గరి చుట్టమా?"

"అయితే మీరే మోయండి. మేమెందుకువద్దంటాం?"

"మరి ముసిల్దాని నగలూ..."

"అదంతా మాకు తెల్దు. మీరన్నా మోయండి. లేక మేమైనా మోస్తాము. మధ్యలో ఎట్టివాళ్లు మోస్తే చూస్తూ ఉండలేము"

"ఎట్టివాళ్ళు ఎందుకూ? సుబ్బయ్యే మోస్తాడు. ఆయమ్మ సొమ్ము తిన్నాడు కదా!"

"సుబ్బయ్యా...? సుబ్బయ్యను మొయ్యనిస్తామా? సుబ్బయ్యకు మోసే అర్హత లేదన్నట్లు గట్టిగా అరిచారు వాళ్ళు.

"అతని కులమేమి? మన కులమేమి? అన్నారు పొగరుగా తలలెగరేసి.

"ఏం? మనకంటే ఎక్కువ కులమే కదా!"

"ఎక్కువ కులం అయితే మాత్రం...? అదిమనకు పరాయి కులమే కదా! ఆయన కులం ఆయనకు గొప్ప అయితే మనకులం మనకూ గొప్పే!" అన్నాడు ఆ నలుగురిలో ఒకడు.

"ముందు ఆ పాడె కట్టేది ఆపండి" అని అరిచారు సుంకప్పా, శీనప్పా ఇద్దరూ!

"ఆపకపోతే...?"

"మా ఊరికి వచ్చి మమ్మల్ని ఎదిరిస్తారా?"

"ఏం? ఏం చేస్తారు? ఈ ఊరికి మీరేమైనా పాలిగాళ్ళా?"

"అయితే రండిరా! ఏలుకోండి!ఈ నరసాపురం శాశిమోళ్ల దెబ్బ మీకింకా తెలీదు రండి"

"మీరు నరసాపురం శాశిమోళ్లు అయితే మేం నేత్రపల్లి కారెణ్యావాళ్ళంరా! మీనం మీద నిమ్మకాయ నిలబెట్టినవాళ్ళంరా! మీరు మొగోళ్ళయితే మేం గీసిన గీత దాటి రండిరా! చూసుకుందాం!"

ముందుకురికే శీనప్ప రెక్క పట్టుకున్నాడు సుంకప్ప. "వద్దు రా శీనప్పా! సాటి కులస్తులతో తగువొద్దు. వీళ్ళతో మనకెందుకు? మనం కక్ష చూపించాల్సింది సుబ్బయ్య మీద" అని బలవంతంగా లాక్కుపోయి ఇంట్లోకి తోసి గడియపెట్టాడు. ఆ కులంలోని వాళ్ళకే తంటాపెట్టిన సుబ్బయ్య నిశ్శబ్దంగా ఇంట్లో కూర్చున్నాడు. కొట్లాట సద్దుమణిగేవరకూ బైటికి రాకుండా!

పొద్దు మునిగే సమయానికి రాములమ్మ శవాన్ని పూడ్చేసి వచ్చారు వాళ్ళు నలుగురూ! సుబ్బయ్య చీటీలో వాగ్దానం చేసినట్లు రాములమ్మవి పాత చీరలూ, పాత్ర సామానూ అన్నీ గోనెసంచిలోకి బిగించి వాళ్ళకు ఒప్పగించాడు. చీటీలో రాసిన విధంగా యాభై రూపాయలు తీసి ఇవ్వబోయాడు.

"గబ్బు వాసన కొట్టే పీనిగని మోసినాం. యాభై రూపాయలేనా ఇచ్చేది?" అని పేచీ పెట్టుకున్నాడు ఎవరి కులం వాళ్ళకు గొప్ప అని బీరాలు పలికిన మనిషి.

సుబ్బయ్య మరో యాభైరూపాయలు తీసిచ్చాడు.

"బన్ను ఛార్జీలకూ...?" అని నసిగాడు 'సుబ్బయ్యని మన శవం ముట్టుకోనిస్తామా!' అని పొగరుగా తల ఎగరేసిన మనిషి!

సుబ్బయ్య మరో ఇరవై రూపాయలు తీసిచ్చాడు.

"నా పీనిగని ముట్టుకుండే దానికి మీకేం సంబంధం రా! అని ముసిల్ది మమ్మల్ని దయ్యమై పట్టుకోదా సావుకారీ? కాబట్టి ఇన్ని బియ్యమూ బేడలూ కట్టియ్యి. బాపనసామిని పిలిచి దినాలు జరుపుకుంటాం" అని భయాన్ని వెళ్లబోసుకున్నాడు మీనమ్మీద నిమ్మకాయ నిలబెట్టిన మొనగాణ్ణని విర్రవీగిన మనిషి.

బియ్యమూ, బేడలూ, ఉప్పూ, కారమూ, చింతపండుతో సహా అంగట్లోని సరుకుల్ని మూట కట్టి ఇచ్చాడు సుబ్బయ్య. అవన్నీ భుజాలకెత్తుకుని వాళ్లు వెళ్ళిపోగానే "హమ్మయ్య! ముసిల్దాని పీడ ఇప్పటికి విరగడయింది" అని గాలి పీల్చుకున్నాడు.

మనిషికి మనిషి మాత్రమే కాదు... శవం కూడా సమస్యే!!

శవవాహకులు అటు వెళ్లిపోగానే ఇటు విధవరాలు తిమ్మక్క పరుగెత్తుకుంటూ

వచ్చింది. "ఒరే ఒరే ! సుంకప్పా! ముసిల్దాని పాత్ర సామానుని ఆ పీనిగ మోసినవాళ్ళకే ఇచ్చేసెనంట కదరా సుబ్బయ్యా! ఎట్లరా? ఇప్పుడెట్లరా??"

"థూ... ముండమోపిదానా! పోతావా లేదా ఇక్కడినుంచీ? మా బాధలో మేముంటే నీదొకటి పైన!"

తిమ్మక్క మళ్ళీ అట్లే పరుగెత్తుకుంటూ వచ్చింది. "ఒరే! శీనప్పా! రారా ! పోయి ఆ పీనిగ మోసిన వాళ్ళని పట్టుకుందాము. మన పిన్నమ్మవి పాత్ర సామాన్లు, పాత చీరెలూ తెచ్చుకుందాము. రా రా"

"థూ...అడుక్కు తినేముండా! ఇక్కడి నుంచీ పోతావా! లేదా! ఆ సుబ్బయ్య మన పిన్నమ్మవి బంగారు సొత్తులు దిగమింగి మనల్ని మోసం చేసెకదా! అన్న రోషమే నీకులేకపాయె. ఫో! పోయి ఏ ఏట్లోనన్నా దూకి సావు పో!"

అట్లే కిందికి కూలబడి రొమ్ములు బాదుకుంటూ అరిచింది విధవరాలు తిమ్మక్క- " ఒరే సుంకప్పా! ఒరే శీనప్పా! పిన్నమ్మవి పాత కోకలూ, పాత్ర సామానూ అన్నీ నాకే వచ్చేటట్లు చేస్తామని ఆ పొద్దు జంబం కూతలు కూస్తిరి కదరా! ఏ ఊరి నా కొడుకులో వచ్చి ఆ చీరల్నీ సామాన్లనీ గద్దల మాదిరి తన్నుకు పోయిరి కదరా!"

"నేను బీద ముండనిరా! మగదిక్కులేని దాన్నిరా! ఏదో ఇంత పాత్ర సామాను వస్తుందని ఆశపెట్టుకోనుంటిరా! మీ పంతాలకు మీరు పోయి ఈ ముండమోపి దాన్ని అన్యాయం జేస్తిరి కదరా! ఈ ఆడపడుచు ఉసురుకొట్టుకుని సచ్చిపోతారులే మీరు! మీ వంశమారా" అని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతూ పొర్లిపొర్లి ఏడ్చింది.

★★★

ఆ శవ వాహకులు నలుగురూ నడుస్తున్నారు ఉత్సాహంగా మాట్లాడుకుంటూ!

"ఆ ముసిల్ది మా తాత చిన్నాయన కూతురు అవుతుందంట"

"మా జేజెమ్మకు తోడికోడలు అవుతుందంట"

"కొన్నాళ్ళు మా తాతను తగులుకొని ఉండెనంట"

"మరి నాకేమీ కాదే...!" అని నవ్వాడు నాలుగోవాడు.

"ఏం కాకపోయినా ఫరవాలేదులే! పీనిగని ఎత్తేస్తే పున్నెమే కదా వచ్చేది!" అన్నాడు ఒకటోవాడు నులకమంచాన్ని మోస్తూ.

"పున్నెం కత దేవుడెరుగు. ఈ కరువు దినాల్లో ఒక దినానికి మూడు దినాల కూలి గిట్టుబాటు అయ్యెకదా!" అన్నాడు రెండోవాడు బియ్యమూ బేడలూ మోస్తూ.

"అదిగో ప్రైవేటు బస్సు గవర్నమెంటు బస్సుకంటే పావలా తక్కువ. పరుగెత్తండి"

శవవాహకులు నలుగురూ బస్సువైపు కేకలు పెడుతూ పరుగెత్తడం ప్రారంభించారు.